## క్లుప్తంగా

### ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి ప్రాంతంలో కృష్ణా జలాలు అందించేందుకు కార్పొరేషన్ అధికారులు కొత్త పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నారు. పనులు చేసే సమయంలో పాతపైపు లైన్ గురువారం పగిలిపోవడంతో కొత్తూరు, పాతూరు ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిచిపోయింది. కార్పొరేషన్ ట్యాంకర్ల ద్వారా సిబ్బంది తాగునీటిని సరఫరా చేశారు. శుక్రవారం ఉదయం నాటికి మరమ్మతులు పూర్తిచేసి పైపు లైన్ ద్వారా తాగునీటిని సరఫరా చేయనున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

### శ్మశానవాటికలో అభివృద్ధి పనులు



మంగళగిరి: ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) చొరవతో నగర పరిధిలోని గోలి రామనాథం శ్మశానవాటికలో గురువారం అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. బుధవారం శ్మశానవాటికను పరిశీలించిన ఎమ్మెల్యే ఆర్కేతో స్థానిక పెద్దలు మాట్లాడుతూ ఎంతో కాలంగా శ్మశానవాటిక అభివృద్ధికి నోచుకోకపోవడంతో కంపచెట్లు పెరిగి లోపలికి వెళ్లే దారి లేక ఇబ్బంది పడుతున్నామని వెంటనే అభివృద్ధి పనులను చేపట్టాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే అభివృద్ధి పనులు చేపట్టాలని నగర పాలక సంస్థ అధికారులకు సూచించారు. దీంతో గురువారం శ్మశానవాటికలో జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆర్కేకి పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.

### ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయినికి డాక్టరేట్



తాడికొండ: తాడికొండ మండలం లాం గ్రామంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ తెలుగు ఉపాధ్యాయురాలు వాయిలపల్లి లక్ష్మీ కుమారికి ఏఎన్‌యూ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ప్రిన్సిపల్ ఉషారాణి తెలిపారు. విశ్రాంత రీసెర్చ్ సూపర్‌వైజర్ డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర జానపద కళా సాహిత్యం–అనుశీలన అనే అంశంపై పరిశోధనా పత్రం సమర్పించిన ఆమెకు గౌరవ డాక్టరేట్ లభించింది. పాఠశాల చైర్మన్ చుక్కపల్లి రమేష్, డైరెక్టర్లు చుక్కపల్లి రాకేష్, చుక్కపల్లి ప్రియాంక, ప్రిన్సిపల్ ఉషారాణిలు ఆమెను అభినందించారు.

### ఘనంగా భగీరథ మహర్షి జయంతి

మంగళగిరి: స్థానిక భగీరథ సేవా ట్రస్టు కార్యాలయంలో గురువారం భగీరథ మహర్షి జయంతి నిర్వహించారు. భగీరథ మహర్షి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ట్రస్టు చైర్మన్ పందేటి సాంబశివరావు మాట్లాడుతూ సగరులు ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిపోయారన్నారు. ప్రభుత్వం సగరులను బీసీ డీ నుంచి ఏకు మార్చి ఆదుకోవాలని కోరారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) నగరంలోని సగరులను గుర్తించి రూ.70లక్ష ఖర్చుతో కమ్యూనిటీ హాలు నిర్మించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు కర్నాటి శివ సత్యనారాయణ, నంగలం ప్రసాద్, జూటు ఏడుకొండలు, కగ్గా శ్రీను, కలవకొల్లు గోపి, నక్కా మహేష్, గండికోట వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.

### మజ్జిగ పంపిణీ

మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెం శివాలయం ఎదుట స్థానిక యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి చలివేంద్రం వద్ద గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. స్థానిక పీఏసీఎస్ చైర్మన్ తాడేకోరు రమేష్‌బాబు తన పదవీ ప్రమాణ స్వీకార మహోత్సవం సందర్భంగా బాటసారులకు, వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జి సాయి, బి వెంకట్రావు, ఎం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### కొండపై వ్యర్థాలను తొలగించిన రోటరాక్ట్ సభ్యులు



మంగళగిరి: నగరంలోని గండాలయ స్వామి కొండపైకి ట్రెక్కింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడంతో పాటు కొండ క్రింద టెంపుల్ హిల్ ఏకో పార్క్ అభివృద్ధి పర్చడంతో నగర వాసులకు ఆహ్లాదం, ఆరోగ్యం కేంద్రంగా అవతరించింది. నగర వాసులతో పాటు విజయవాడ, గుంటూరు పరిసర ప్రాంతాల నుంచి ట్రెక్కింగ్ నిర్వహించేందుకు యువతతో పాటు పలువురు పురుషులు, మహిళలు భారీగా తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయవాడ రోటరాక్ట్ సభ్యులు గురువారం ఉదయం కొండపైకి ట్రెక్కింగ్ నిర్వహించారు. యువకులు కొండపై ఉన్న వ్యర్థాలను తొలగించి స్వచ్ఛ గండాలయస్వామి కొండగా శుభ్రపర్చారు.

# మురుగు సమస్య పరిష్కారం దిశగా అడుగులు

- సర్వే నిర్వహించిన కార్పొరేషన్, ఇరిగేషన్ అధికారులు
- ఆంధ్రరత్న కాలువ వెంబడి కొత్త పైపులైన్ ఏర్పాటుకు ప్రణాళిక




కొలతలు నిర్వహిస్తున్న కార్పొరేషన్, ఇరిగేషన్ అధికారులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి ప్రాంతంలో మురుగు సమస్య రోజురోజుకు పెరిగిపోతోంది. దీనిని పరిష్కరించేందుకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి కార్పొరేషన్ అధికారులతో రెండు రోజుల కిందట సమావేశం ఏర్పాటు చేశారు. గురువారం ఎంటిఎంసి ఇంజినీరింగ్ సిబ్బంది, ఇరిగేషన్ అధికారులు ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ పంటకాలువలో మురుగు సమస్య నివారించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. పంపింగ్ స్కీమ్ నుంచి నగర పాలక సంస్థ పరిధిలోని రామచంద్రాపురం వరకు ఉన్న కాలువగట్టు ఎంత ఉంది? కాలువ ఎంత ఉన్నది కొలతలు నిర్వహించారు. కాలువకు ఇరువైపులా ఉన్న కట్ట 70 అడుగులు, మరికొన్ని చోట్ల 100 అడుగులు ఉన్నట్లు గుర్తించారు. కాలువలోకి మురుగు కలవడం వల్ల నాలుగువేల ఎకరాల్లో పంట దెబ్బతింటోందని రైతులు కొన్ని సంవత్సరాల నుంచి ఆందోళన చేస్తున్నారు. ఎట్టకేలకు ఎమ్మెల్యే ఆర్కే సూచనల మేరకు అధికారులు సుమారు 15 కి.మీ. పొడవున డ్రెయిన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ దగ్గర నుండి కాలువ శివారు వరకు అండర్ గ్రౌండ్ పైపులైన్ వేసి తాడేపల్లిలోని బహుళ అంతస్తుల నుంచి వచ్చే మురుగుని మళ్లించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. డ్రెయిన్ ఏర్పాటు చేయడం వల్ల తాడేపల్లి, కుంచనపల్లి, ప్రాతూరు, గుండిమెడ, చిర్రావూరు, మంగళగిరి రూరల్‌లోని నూతక్కి, రామచంద్రాపురం తదితర ప్రాంతాల్లో మురుగు సమస్యను పూర్తిగా నివారించవచ్చని అధికారులు భావిస్తున్నారు. మరోసారి పూర్తిస్థాయిలో పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్, ఇరిగేషన్ శాఖ ఏఈ సుభాని, పంటకాలువ ఇన్‌చార్జి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ ఖ్యాతిని దేశానికి తెలియజేసిన రాజా వాసిరెడ్డి

ఘనంగా నివాళులర్పించిన ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు



రాజా వాసిరెడ్డి, శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే తదితరులు

మంగళగిరి: మంగళగిరి నృసింహస్వామి ఆలయ ఖ్యాతిని దేశానికి తెలియజేసిన ఘనత రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడిదని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) కొనియాడారు. రాజా వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు జయంతిని గురువారం నిర్వహించారు. నగరంలో వేంచేసి ఉన్న లక్ష్మీనృసింహస్వామి ఆలయం వద్ద రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు పేరుతో నిర్మించిన కళావేదిక వద్ద ఏర్పాటుచేసిన రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు, శ్రీ కృష్ణదేవరాయలు విగ్రహాలకు ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవిలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ శ్రీ కృష్ణదేవరాయలు అమరావతిని రాజధానిగా చేసుకుని అద్భుతంగా పరిపాలించగా రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు మంగళగిరి లక్ష్మీ నృసింహస్వామి ఆలయానికి ఎత్తైన గాలిగోపురం నిర్మించి మంగళగిరి పేరును చరిత్రలో చిరస్థాయిగా నిలపడం అభినందనీయమన్నారు. వాసిరెడ్డి వంశీయులను సన్మానించగా వారు వేంకటాద్రినాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, నాయకులు ఆకురాతి రాజేష్, ఎండీ ఫిరోజ్, వ్యాసం అజయ్, కందుకూరి గోపాల కృష్ణమూర్తి, వాసిరెడ్డి వంశస్తులు వాసిరెడ్డి శివప్రసాదరావు, వాసిరెడ్డి వెంకటసుబ్బారావు, వాసిరెడ్డి విజయ్‌కుమార్, వాసిరెడ్డి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**పెదకోనేరు పనులు వేగవంతం చేయాలి**

నగరంలో వేంచేసి ఉన్న లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి చెందిన పెదకోనేరు(కళ్యాణ పుష్కరణి) పునరుద్ధరణ పనులను ఎమ్మెల్యే ఆర్కే పరిశీలించారు. పెదకోనేరులో పూడికతీత పనులు మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. కోనేరులోకి వస్తున్న ఊటను ఎప్పటికి అప్పుడు బయటకు తరలించేలా చర్యలు తీసుకుని కోనేరు అభివృద్ధి పనులు పూర్తి చేసి స్వామి వారికి కోనేరులోని నీటితో పూజలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కోనేరు అంతర్భాగంలో ఉన్న శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**రిక్షా అందజేసిన ఎమ్మెల్యే ఆర్కే**

నగర పరిధిలోని నిడమర్రులో తుర్లకొండ సాంబశివరావుకి ఎమ్మెల్యే ఆర్కే రిక్షా అందజేశారు. సాంబశివరావు మంగళగిరి, నిడమర్రులలో కిరాణాదుకాణాలకు సరుకులు రవాణా చేసి జీవనం సాగిస్తుంటాడు. ఇటీవల సాంబశివరావు ఎమ్మెల్యే ఆర్కేను కలిసి తనకు రిక్షా లేక ఇబ్బంది పడుతున్నానని తెలపడంతో వెంటనే ఎమ్మెల్యే రిక్షాను తయారు చేయించగా బుధవారం మార్కెట్ యార్డు డైరెక్టర్ షేక్ మాలిని, స్థానిక నాయకులు కొల్లి శేషిరెడ్డి, బోళ్ల విష్ణు, మర్రెడ్డి శివరామిరెడ్డి, గాదె సాగర్‌రెడ్డి, కలవకొల్లు నాగరాజు, షేక్ బాజి, మండెపూడి నాగరాజు చేతుల మీదుగా సాంబశివరావుకు రిక్షా అందజేయగా సాంబశివరావు ఎమ్మెల్యే ఆర్కేకు ధన్యవాదాలు తెలిపారు.

# దళితులను దూషిస్తే సహించం

చంద్రబాబు, లోకేష్‌లపై పోలీసులకు ఫిర్యాదు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు డి.కత్తిరేణమ్మ, వైస్ ఎంపీపీ చంద్రం

ఫిరంగిపురం: దళితులను దూషిస్తే సహించబోమని జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మాజీ సీఎం చంద్రబాబునాయుడు ఇటీవల యర్రగొండపాలెంలో దళిత మంత్రిపైన , దళితులపై అసభ్యపదజాలంతో దూషించడం హేయమని చెప్పారు. నారా లోకేష్ తన పాదయాత్రలో దళితులు ఏమి పీకారంటూ చులకనగా మాట్లాడటం సహేతుకం కాదన్నారు. అనంతరం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు అందజేశారు. సమావేశంలో వైస్ ఎంపీపీ జి.చంద్రం, పి.జేమ్స్‌ఇన్నయ్య, కె.చిన్నప్పరెడ్డి, డి. సురేష్, సర్పంచులు మేడా బాబు, డి.మెల్కియా, చిట్టా అంజిరెడ్డి, పి.రఘు, సీహెచ్ రామమోహన్‌రెడ్డి, జి.ఇబ్రాయిల్, ఆర్.రంజన్‌బాబు, బి.అంజిరెడ్డి, మస్తాన్‌వలి, సత్యం , సాల్మన్‌రాజు, నాగేశ్వరరావు, జానీబాషా, ఎం.సుధాకరరెడ్డి, టి.కృష్ణ, ఎస్.జోజప్పలు పాల్గొన్నారు.

# పెరిగిన మహంకాళీ అమ్మవారి దేవస్థాన ఆదాయం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసి ఉన్న మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో వివిధ రకాల సామాగ్రి అమ్మకాలు, సేకరణకు సంబంధించి గురువారం వేలం నిర్వహించారు. ఈ వేలంలో గతేడాది కన్నా ఆదాయం పెరిగింది. కొబ్బరి చెక్కల సేకరణ హక్కు గతంలో రూ.4,50,000 ఉండగా ప్రస్తుతం చిలువూరుకు చెందిన మాలెంపాటి వెంకటేశ్వరరావు రూ.4,80,116లకు పాట దక్కించుకున్నాడు. గ్యాస్‌పొయ్యిలు నిర్వహించుకునే హక్కును గతంలో రూ.3,11,116 కాగా, మంచికలపూడికి చెందిన యార్లగడ్డ శ్రీనివాసరావు రూ.4,11,116లకు పాడుకున్నారు. పార్కింగ్ వసూలు హక్కుకు గతంలో రూ.6,11,000 ఉండగా ప్రస్తుతం చిలువూరుకు చెందిన వడ్లమూడి విజయ్‌కుమార్ రూ.7,49,167 దక్కించుకున్నారు. వంటసామాగ్రి, టేబుల్స్, షామినాయాలు వేలం గతంలో రూ.3,11,116 ఉండగా ప్రస్తుతం మంచికలపూడికి చెందిన యేమినేని రవీంద్రబాబు రూ.4,50,000లకు పాడుకున్నారు. చీరలు, జాకెట్ ముక్కల వేలం గతంలో రూ.9,01,000 కాగా ఈ సంవత్సరం చిలువూరుకు చెందిన యడ్ల శివశేఖర్ రూ.12,90,000లకు, చిన్న తీర్థం, పెద్దతీర్థం గతంలో రూ.3,00,116 ఉండగా ఈ ఏడాది చిలువూరుకు చెందిన మాలెంపాటి వెంకటేశ్వరరావు రూ.3,56,116లకు దక్కించుకున్నారు. మొత్తం ఆదాయం గతంలో రూ.28,34,348 కాగా, ఈ ఏడాది రూ.37,36,515 వచ్చినట్లు ఈఓ చినవెంకటరెడ్డి తెలిపారు. వేలం మొత్తం సీల్డ్ కవర్ల ద్వారా సేకరించామని, 11-07-2023 నుంచి 10-07-2024 వరకు హక్కు కలిగి ఉంటారన్నారు.

# అక్రమంగా ఆలయ నిర్మాణంపై ఆందోళన



సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న ఈమని గ్రామస్తులు

తెనాలి: దుగ్గిరాల మండలం ఈమనిలో అక్రమ ఆలయ నిర్మాణాన్ని అడ్డుకోవాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన పలువురు గురువారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. కార్యాలయ ఏవో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం సమర్పించారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని బహిర్భూమిని ఆక్రమించి ఉయ్యూరు వారి దేవర రేణుకమ్మ గుడిని నిర్మిస్తున్నట్టు గతేడాది డిసెంబరు 13న సబ్‌కలెక్టర్ కార్యాలయానికి, జిల్లా కలెక్టరుకు తెలియజేసినట్టు గుర్తుచేశారు. వాములదొడ్డికి వెళ్లే రోడ్డును ఆక్రమించి గుడి నిర్మాణం చేస్తున్నారని కొందరు రైతులు కోర్టుకు వెళ్లగా, కోర్టు ఇంజక్షన్ ఉత్తర్వులు ఇచ్చినట్టు తెలిపారు. అయినప్పటికీ పనులు కొనసాగుతూనే ఉన్నాయని తెలిపారు. గుడి నిర్మాణానికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని పంచాయతీ కార్యదర్శి సమాచారహక్కు చట్టం ప్రకారం సమాధానం ఇచ్చినట్టు తెలిపారు. దీనిపై నిర్మాణం చేస్తున్నవారు తమను బెదిరించారని, పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వివరించారు.

# పంటల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

తాడేపల్లిరూరల్: జొన్న, మొక్కజొన్న పంటల కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు డిమాండ్ చేశారు. దేవేంద్రపాడు, శృంగారపురం, పెదపాలెం, పెరుకలపూడి, మోరంపూడి గ్రామాల్లో గురువారం పర్యటించి రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు, రైతు సంఘం జిల్లా నాయకులు వి.సాంబశివరావు, రైతులు తాడిబోయిన ఫణికుమార్, కానసాని వెంకటేశ్వరరావు, అయిలా నరసింహారావు, గోగం తిరుపతయ్య, పసుపులేటి సాంబశివరావు, యలవర్తి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

### వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణే లక్ష్యం



మంగళగిరి: వక్ఫ్‌బోర్డు ఆస్తుల పరిరక్షణే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ప్రత్యేక అధికారి షేక్ షరీన్ బేగం తెలిపారు. గురువారం మంగళగిరిలోని స్టేట్ మైనార్టీస్ కమిషన్ కార్యాలయానికి విచ్చేసిన ఆమెకు కమిషన్ చైర్మన్ డాక్టర్ కె ఇక్బాల్ అహ్మద్ ఖాన్, వైస్ చైర్మన్ డాక్టర్ జాషువా దానియేల్ సత్కరించారు. ఆమె మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు ఆస్తులను రక్షించి బోర్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు.

## ఇంటర్మీడియెట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

మంగళగిరి టాపర్‌గా యర్రబాలెం విద్యార్థిని



టి ప్రవళిక



షేక్ రిజ్వానా

మంగళగిరి: ఈనెల 26వ తేదీన విడుదలైన ఇంటర్మీడియెట్ ఫలితాల్లో నగర విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. నగర పరిధిలోని యర్రబాలెంకు చెందిన వీజే కళాశాల విద్యార్థిని టి ప్రవళిక ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 986 మార్కులు సాధించి నగర టాపర్‌గా నిలిచింది. నిర్మలా కళాశాలకు చెందిన మొనుబోలు జాహ్నవి 985 మార్కులు సాధించి ద్వితీయ స్థానం, కాటూరి విజయ కుమారి 972 మార్కులు సాధించి తృతీయ స్థానం సాధించింది. ద్వితీయ సంవత్సరం బైపీసీలో నిర్మలా కళాశాల విద్యార్థిని షేక్ రిజ్వానా 980 మార్కులతో సాధించగా మర్రి శ్రీలత 977 మార్కులు సాధించింది. బైపీసీ తొలి సంవత్సరంలో సాయి గణేష్ 430 మార్కులు సాధించగా అవ్వారు గాయత్రీదేవి 425 మార్కులు సాధించింది. ఎంపీసీలో గోలి ఐశ్వర్యలక్ష్మి 451 మార్కులు సాధించింది. ఎంఈసీలో పఠాన్ నదియా 955 మార్కులు సాధించగా సీఈసీలో షేక్ కరిముస్నీసా 958 మార్కులు సాధించింది. జూనియర్ ఎంపీసీలో శ్రీచైతన్య కళాశాలకు చెందిన విద్యార్థిని ఎస్ త్రివేణి 461 మార్కులు సాధించింది. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఆయా కళాశాలల కరస్పాండెంట్లు, సెక్రటరీలు, ఉపాధ్యాయులు అభినందించారు.

## నగరంలో జగనన్నే మా భవిష్యత్



16వ వార్డు సచివాలయం పరిధిలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

మంగళగిరి: నగరంలోని అయా వార్డుల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జోరుగా కొనసాగుతుంది. గురువారం నగర పరిధిలోని ఆయా సచివాలయాల పరిధితోపాటు వార్డుల్లో మా నమ్మకం నీవే జగన్, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించిన నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి ప్రజా మద్దతుపై సర్వే నిర్వహించారు. ప్రజలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు యథావిధిగా ఇంటి వద్దకే కొనసాగాలంటే జగనన్నకు అండగా నిలవాలని కోరారు. సంక్షేమ పథకాలు అందుకుంటున్న ప్రజలు స్వచ్ఛందంగా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొని నాయకులకు స్వాగతం పలికి జగనన్నకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వార్డు నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

ఆత్మకూరు, నిడమర్రు, నవులూరు, యర్రబాలెం, కురగల్లు, చినకాకాని, పెదవడ్లపూడిలోనూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాలు నిర్వహించారు.

# తాడేపల్లి, ఉండవల్లి రైతులకు ఊరట

- గుంటూరు చానల్ వెంబడి గ్రావెల్ రోడ్డుకు సన్నాహాలు
- జంగిల్ క్లియరెన్స్ చేస్తున్న కార్పొరేషన్ అధికారులు



ఉండవల్లి వద్ద గుంటూరు చానల్‌పై జంగిల్ క్లియరెన్స్ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లి దళితవాడకు వెళ్లే కరకట్ట నుంచి సులకపేట గుంటూరు చానల్ వరకు ఉన్న పంట పొలాలకు రోడ్డు మార్గం లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాలసోమిరెడ్డి ఈ విషయాన్ని తీసుకువెళ్లారు. రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించడంతో గురువారం గుంటూరు చానల్ వెంబడి జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. ఈ రహదారి వేయడం వల్ల ఉండవల్లి దళితవాడ నుండి కరకట్ట మీదుగా సులకపేట వచ్చేవారికి ఉపయోగపడుతుందని, సుమారు 600 ఎకరాల పంటపొలాలకు రహదారిగా ఉపయోగపడుతుందని డీఈ కృష్ణారెడ్డి తెలిపారు.

# బాధ్యత భవితను ఇస్తే భద్రత బతుకునిస్తుంది

డీటీసీ ఎస్‌కే కరీమ్



ర్యాలీని ప్రారంభిస్తున్న డీటీసీ ఎస్‌కే కరీమ్

మంగళగిరి: బాధ్యత భవితను ఇస్తే భద్రత బతుకునిస్తుందనే విషయాన్ని వాహనచోదకులు గుర్తుంచుకోవాలని జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ అధికారి ఎస్‌కే కరీం అన్నారు. రోడ్డు భద్రతపై గురువారం నగర పరిధి కాజ జెమ్స్ స్కూల్ విద్యార్థులు, ఎస్ఆర్ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన డీటీసీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. గుంటూరు జిల్లాలో ఏడాదికి 12వేల రోడ్డు ప్రమాదాలు నమోదు అవుతుండగా 1200 మంది మృత్యువాత పడుతున్నారని, మిగిలిన వారు క్షతగాత్రులుగా, వికలాంగులుగా మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అతివేగం, నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపే వారు హెల్మెట్, కార్లు నడిపే వారు సీటు బెల్ట్ ధరించాలని, ఈ అలవాటును బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెమ్స్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రసన్నరాణి జాయ్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ప్రేమ్‌కుమార్, జయలక్ష్మి మోటార్స్ సీఈఓ శ్రీనాథ్, ఆపెక్స్ సొల్యూషన్స్ అధినేత అశోక్, ఎస్ఆర్ఎం స్టూడెంట్స్ అఫైర్స్ డైరెక్టర్ అనిల్ నిగమ్, అసిస్టెంట్ డైరెక్టర్ రేవతి, చీఫ్ లైజనింగ్ అధికారి పూళ్ల రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు

- ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- నగర కమిషనర్ యు శారదాదేవి

మంగళగిరి: నగర పరిధిలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని నగర కమిషనర్ యు శారదాదేవి తెలిపారు. నగరంలోని కార్యాలయంలో ఆమె గురువారం మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం రీ వెరిఫికేషన్ నిర్వహించిన అనంతరం కొంతమంది అనర్హులుగా ప్రకటించామని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మరలా వెరిఫికేషన్ చేసి అర్హులై ఉంటే ఇళ్ల స్థలం అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం ప్రతి మూడు నెలలకు ఒకసారి వెరిఫికేషన్ నిర్వహించి అర్హులకు ఇళ్ల స్థలాలను అందజేస్తామని తెలిపారు. అర్హులైన ఏ ఒక్కరూ సొంత ఇల్లు లేకుండా ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం నిరంతర ప్రక్రియగా చేపట్టిందని, ప్రస్తుతం అనర్హులుగా ప్రకటించిన వారు మరలా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. మరలా వెరిఫికేషన్ నిర్వహించి అర్హులైతే వెంటనే ఇళ్ల స్థలం మంజూరు చేస్తామని స్పష్టం చేశారు.

# ఇప్పటం సొసైటీ పాలకవర్గం ఎన్నిక



చైర్మన్‌గా ఎన్నికైన మేకల సాంబశివరావుకు అభినందనలు తెలియజేస్తున్న రైతులు

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని ఇప్పటం కో ఆపరేటివ్ సొసైటీ పాలకవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. సొసైటీ చైర్మన్‌గా చిర్రావూరుకు చెందిన మేకల సాంబశివరావును ఎన్నుకోగా, తాడేపల్లి అగ్రికల్చర్ ఏఓ శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారాన్ని చేయించారు. సొసైటీ బోర్డు మెంబర్లుగా కొలనుకొండకు చెందిన నూతక్కి శ్రీనివాసరావు, ప్రాతూరు ప్రకాశరావులను మెంబర్లుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తాడేపల్లి రూరల్ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, లీగల్ సెల్ నాయకులు కాశినీడు బాజీ గంగాధర్, ఇప్పటం సొసైటీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా విఘ్నేశ్వరుడి వార్షికోత్సవం

ఫిరంగిపురం: మండలంలోని అల్లంవారిపాలెం గ్రామంలోని విఘ్నేశ్వరస్వామి ఆలయ సప్తమ వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి అర్చకులు అంజనేయశర్మ, రాజేంద్రశర్మలు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి ఐదు రకాల పుష్పాలు, గరికతో అష్టోత్తర, సహస్ర నామ పూజలు చేశారు. మండపారాధన, నవగ్రహ పూజ, పుణ్యాహవాచనం ,షోడశోపచార పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు.



**చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్**

కుప్పూరావుకాలనీ బ్రాంచ్, గుంటూరు జిల్లా.

ఫోన్: 9100910459, 08645-234540, email: bm0702@cggb.co.in

## స్వాధీనత ప్రకటన

[illegible]

తేది : 27-04-2023
స్థలము : మంగళగిరి

సం/- అధీకృత అధికారి, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, [illegible] బ్రాంచ్, మంగళగిరి, గుంటూరు జిల్లా.